

తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల పరిధిలో ఎస్సీ, బీసీ, బలిజ, మైనారిటీ, మహిళా సిటింగు ఎమ్మెల్యేలలో తీవ్ర అలజడి నెలకొంటోంది. అదే సమయంలో ఓ కులానికి చెందిన బలమైన సిటింగు ఎమ్మెల్యేలు మాత్రం నిశ్చింతగా కనిపిస్తున్నారు. అధికార వైసీపీ అధిష్ఠానం తీరుతో తొమ్మిది నియోజకవర్గాల్లో సామాజికంగా వెనుకబడిన వర్గాలు తీవ్ర నిస్పృహకు లోనవుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో టికెట్లు తిరిగి దక్కుతాయో లేదోనని ఈ వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు తీవ్ర ఆందోళన చెందుతుండడం గమనిస్తున్న ఆయా వర్గాలు అధికార పార్టీ అధిష్ఠానంపై మండిపడుతున్నాయి. సిటింగు ఎమ్మెల్యేలకు చెందిన సామాజికవర్గాలను తక్కువగా చూస్తున్నందునే వారికి అవకాశాల పట్ల ఇష్టానుసారంగా ఆడుకుంటున్నారన్న భావనకు సంబంధిత వర్గాలు లోనవుతున్నాయి.

- నిశ్చింతగా ప్రాబల్య కులానికి చెందిన నేతలు

9మంది సిటింగుల్లో అలజడి

సామాజికంగా వెనుకబడిన కులాల నేతలతో వైసీపీ అధిష్ఠానం తీరు ఫలితం



తిరుపతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో సత్యవేడు, జీడీనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాలు, కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లా పరిధిలోకి చేరిన గూడూరు, సూళ్ళూరుపేట వంటి ఐదు నియోజకవర్గాలు ఎస్సీ రిజర్వుడుగా వున్నాయి. వీటికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలు ఐదుగురూ అధికార పార్టీకి చెందిన వారే. గూడూరులో రిటైర్డు ఐఏఎస్ అధికారి వరప్రసాద్, సూళ్ళూరుపేటలో కిలివేటి సంజీవయ్య, సత్యవేడులో కోనేటి ఆదిమూలం, జీడీనెల్లూరులో కళత్తూరు నారాయణస్వామి, పూతలపట్టులో ఎంఎస్ బాబులలో ఒక్కరంటే ఒక్కరికి కూడా టికెట్‌పై వైసీపీ అధిష్ఠానంనుంచీ స్పష్టమైన హామీ లభించలేదు. ఈ ఐదు చోట్లా అభ్యర్థులను మారుస్తారన్న ప్రచారం జరుగుతూండడంతో దాదాపుగా వీరందరూ తీవ్ర అభద్రతతో వున్నారు. వీరిలో సత్యవేడు, పూతలపట్టు ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇచ్చేది లేదని చెప్పేసినట్టు కూడా ప్రచారం జరుగుతోంది. సూళ్ళూరుపేట ఎమ్మెల్యే సంజీవయ్యకు టికెట్ దక్కడం పట్ల అనుమానం వుండబట్టే ఎంపీ విజయసాయిరెడ్డిని నడిరోడ్డుపై అడ్డగించి అనుచరులతో తనకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేయించారు.ఈ ఐదుగురిలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి సహా ఎవరూ టికెట్ తనకే అని ధైర్యంగా చెప్పలేని పరిస్థితి. మదనపల్లె సిటింగ్ ఎమ్మెల్యే నవాజ్ బాషాకు కూడా టికెట్ లేదని స్పష్టత ఇచ్చినట్టు తెలిసింది. దీంతో ఆయన కూడా నిర్వేదంలో వున్నట్టు సమాచారం. పలమనేరు సిటింగ్ ఎమ్మెల్యే వెంకటే గౌడ బీసీగా పరిగణించబడుతున్న సంగతి తెలిసిందే. అక్కడా ఆయనకు కాకుండా మాజీ మంత్రి అమరనాథరెడ్డిని ఓడించేందుకు బలమైన వ్యక్తిని పోటీ చేయించేందుకు వైసీపీ అధిష్ఠానం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఏకైక బీసీ ఎమ్మెల్యేగా వున్న వెంకటేగౌడ దీంతో నైరాశ్యంలో కూరుకుపోయినట్టు సమాచారం. జిల్లాలో ఏకైక బలిజ ఎమ్మెల్యేగా వున్న చిత్తూరు ఆరణి శ్రీనివాసులుకు కూడా మొండిచేయి చూపారని, అక్కడ ఆయనకు ప్రత్యామ్నాయంగా రెడ్డి సామాజికవర్గానికి చెందిన నేతకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో శ్రీనివాసులు కూడా నిస్పృహతో వున్నట్టు సమాచారం. జిల్లాలో ఏకైక మహిళా ఎమ్మెల్యేగా వున్న మంత్రి రోజా సైతం టికెట్‌పై ధీమాగా లేరు. అక్కడ మార్పు తప్పదన్న సంకేతాలుండడంతో జోరు తగ్గించిన ఆమె తనకు టికెట్ ఇవ్వకపోయినా సీఎం జగన్ కోసం త్యాగం చేసేందుకు సిద్ధమని తగ్గి మాట్లాడుతున్న పరిస్థితి. ఇలా తొమ్మిది నియోజకవర్గాల్లో ఎస్సీ, బీసీ, బలిజ, మైనారిటీ, మహిళ వంటి సామాజికంగా వెనుకబడిన సిటింగు ఎమ్మెల్యేలు అనిశ్చితిలో, అభద్రతతో సతమతమవుతున్నారు.

నిశ్చింతగా బలమైన నేతలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాతోపాటు కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లాకు సంబంధించి చూస్తే బలమైన నేతలు టికెట్‌పై నిశ్చింతగా వుండడం కనిపిస్తోంది. వెంకటగిరిలో సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి, తిరుపతి సమన్వయ కర్త భూమన అభినయ్‌రెడ్డి, చంద్రగిరి సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పీలేరులో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లెలో ద్వారకనాథ రెడ్డి వంటివారు వచ్చే ఎన్నికలకు ధీమాగా సమాయత్తమవుతున్నారు. వారిలో టికెట్ మార్పు భయం ఏ కోశానా కనిపించడం లేదు. కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ బీసీ అయినప్పటికీ అక్కడ అంతకు మించిన ప్రత్యామ్నాయం లేకపోవడంతో ఆయన నిక్షేపంగా వుండగలుగుతున్నట్టు సమాచారం. ఈ పరిణామాలు ఈ ప్రాంతాల్లోని సామాజికంగా వెనుకబడిన ఎస్సీ, బీసీ, మైనారిటీ, బలిజ, మహిళా వర్గాలలో అధికార పార్టీ పట్ల తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. టికెట్ దక్కని ఆయా వర్గాల నేతలు కడుపుమండి అధిష్ఠానంపై విమర్శలకు దిగుతుంటే అధిష్ఠానం ఇతర నేతలతో వారిపై ఎదురుదాడి చేయిస్తుండడం ఆయా సామాజికవర్గాలకు మింగుడు పడడం లేదు. బలహీనవర్గాల సిటింగు ఎమ్మెల్యేల రాజకీయ జీవితాలతో ఆడుకుంటున్నవైనం ఆ వర్గాల్లో ఆగ్రహావేశాలు రగిలిస్తున్నాయి. దీని పర్యవసానం వచ్చే ఎన్నిల్లో అధికార పార్టీపై ప్రతిఫలించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పూతలపట్టు వైసీపీలో సిగపట్లు

- తెరమీదకు మూడో పేరు


డాక్టర్ పూజారి లోకవర్ధన్

తిరుపతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రిజర్వుడు నియోజకవర్గమైన పూతలపట్టు సీటు ఎవరికి కేటాయించాలనే విషయంలో వైసీపీ అధిష్ఠానం మరో ప్రత్యామ్నాయాన్ని పరిశీలిస్తోంది. పీలేరు నియోజకవర్గం కలికిరి పట్టణానికి చెందిన డాక్టర్ పూజారి లోకవర్ధన్ పేరు ముఖ్యనేతల ద్వారా అధిష్ఠానం దృష్టికి వెళ్ళింది. అక్కడ సిటింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు టికెట్ లేదని అధిష్ఠానం తేల్చి చెప్పేసిన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ ప్రత్యామ్నాయంగా తెరమీదకు వచ్చిన సంగతి తెలిసిందే. ఎంఎస్ బాబుకే టికెట్ ఇవ్వాలని ఓ వర్గం కోరుతుండగా ఆయనను పక్కన పెట్టి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్‌కు అవకాశం కల్పించాలని మరో వర్గం విజ్ఞప్తి చేస్తోంది. ఈ అంతరం క్రమేపీ పెరిగిపోయి సునీల్‌కుమార్‌కు టికెట్ ఇస్తే అతడికి సహకరించకూడదని ఎంఎస్ బాబు వర్గం నిర్ణయించుకున్నట్టు సమాచారం. అదే సమయంలో ఒక వేళ తిరిగి ఎంఎస్ బాబుకే గనుక టికెట్ కేటాయిస్తే అతడికి సహకరించరాదని ఆయన్ను వ్యతిరేకిస్తున్న వర్గం భావిస్తున్నట్టు తెలిసింది. ఇద్దరిలో ఎవరికి అవకాశమిచ్చినా ఓ వర్గం పనిచేయదన్న సమాచారం అధిష్ఠానానికి అందినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో అధిష్ఠానం ఇరువురినీ పక్కన పెట్టి అవసరమైతే మూడవ వ్యక్తిని రంగంలోకి దించాలని ఆలోచిస్తున్నట్టు సమాచారం. ఆ క్రమంలోనే కలికిరి పట్టణానికి చెందిన డాక్టర్ లోకవర్ధన్ పేరు అనూహ్యంగా తెరమీదకు వచ్చింది. సీనియర్ వైద్యుడైన ఆయన ప్రస్తుతం అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలతో సన్నిహిత సంబంధాలున్నాయి. దానికి తోడు ఆయన సతీమణి వైసీపీ తరపున కలికిరి జడ్పీటీసీగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన పేరు అధిష్ఠానానికి వెళ్ళినట్టు చెబుతున్నారు. పూతలపట్టులో పాత కాపుల కంటే కొత్త వారిని బరిలోకి దింపితే వర్గ విభేదాలు, అసంతృప్తులు వంటివి వుండవన్న భావనతో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్ సైతం లోకవర్ధన్ పేరు సూచిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. పూతలపట్టు నుంచీ వైసీపీ 2014లో డాక్టర్ సునీల్‌కుమార్‌కు తొలిసారి టికెట్ ఇవ్వగా ఆయన గెలిచారు. 2019లో సునీల్‌కుమార్‌ను పక్కన పెట్టి ఎంఎస్ బాబుకు టికెట్ ఇవ్వగా ఆయనా గెలిచారు. దీంతో కొత్త వారికి టికెట్ ఇస్తే గెలుస్తారన్న అభిప్రాయం ఆ పార్టీ వర్గాల్లోనూ వ్యక్తమవుతోంది. దీంతో రానున్న ఎన్నికల్లో సిటింగును, మాజీ ఎమ్మెల్యేని కాదని కొత్త వ్యక్తిని పోటీకి దింపాలన్న ఈ ప్రయత్నం ఎంతవరకూ సఫలీకృతమవుతుందో, దీనిపట్ల పూతలపట్టు నియోజకవర్గ వైసీపీ నాయకులు, శ్రేణులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సివుంది.

- సమ్మెలో పారిశుధ్య కార్మికులు

చెత్త చెత్తగా చిత్తూరు


డస్ట్‌బిన్ నిండిపోయి కింద పేరుకుపోయిన చెత్త


టెలిఫోన్‌కాలనీలో చిందరవందరగా పడిఉన్న చెత్త

చిత్తూరు, జనవరి 4: చిత్తూరు చెత్తమయంగా మారింది. నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న కార్మికులు సమ్మెబాట పట్టడంతో చెత్త, వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. సమాన పనికి సమానవేతనం, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. దీంతో నగరంలో పారిశుధ్య పనులు నిలిచిపోయాయి. చిత్తూరు నగరపాలకసంస్థలో పర్మినెంట్, ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికులు కలిపి 488 మంది పని చేస్తున్నారు. వీరిలో 375 మంది ఔట్‌సోర్సింగ్, 113 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో బుధవారం నుంచి ఔట్‌సోర్సింగ్ కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో నగరంలో పారిశుధ్య పనులు నిలిచిపోయాయి. నగరంలో 50 డివిజన్లలో 55వేల కుటుంబాల్లో 2.50 లక్షల మంది జనాభా ఉన్నారు. ప్రతిరోజూ 65 టన్నుల చెత్తను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. కార్మికుల సమ్మెతో చాలాచోట్ల చెత్త సేకరణ నిలిచిపోయింది. టెలిఫోన్‌కాలనీ, తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా, మార్కెట్, జంతువధశాల, విద్యుత్‌నగర్, ఇరువారంతో పాటు వాణిజ్య సముదాయాలు ఎక్కువగా ఉన్న చర్చివీధి, బజారువీధి తదితర ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయింది. కాలువల్లో పూడిక తీయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ప్రధాన రహదారుల్లో మట్టిపేరుకుపోయి దుమ్ముతో ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

100 మంది రోజువారీ కూలీలు

ఔట్‌సోర్సింగ్ కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో నగరపాలక అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిసారించారు. బుధవారం కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో వందమంది దినసరికూలీలతో పాటు డ్రైవర్లను తీసుకున్నారు. వారితో చెత్త పనులు చేయించడంతో పాటు శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, ఇతర సిబ్బందిని పర్యవేక్షకులుగా నియమించారు. 50 డివిజన్లకు వెయ్యి మంది పనిచేయాల్సిన చోట 488 మందే పనిచేస్తున్నారు. ఇప్పటికే ఉన్న కార్మికులతో రోజుమార్చి రోజు చెత్తను తొలగిస్తున్నారు. కార్మికుల సమ్మెతో ప్రత్యామ్నాయంగా వంద మందిని తీసుకున్నా పూర్తి స్థాయిలో చెత్తను ఎలా తొలగిస్తారని నగర ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సమ్మె నేపథ్యంలో కమిషనరు అరుణ నగరంలో పర్యటించారు. చెత్తను ఇష్టారాజ్యంగా పడేయకుండా కార్మికులకుఅందించాలని స్థానికులు, దుకాణదారులను కోరారు. సహాయ కమిషనరు గోవర్ధన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలి

- రెండో రోజుకు చేరిన కార్మికుల సమ్మె

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్ కోరారు. రెండో రోజైన గురువారం చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద కార్మికులు పడుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. కరోనా వైరస్ ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా కాపాడుతున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండు చేశారు. లేదంటే రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు దాసరి చంద్ర, మణి, గోపీనాథ్, రమాదేవి, కార్మిక సంఘం నేతలు శరవణ, జయప్రకాష్, వెంకటేశ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


నగరపాలక కార్యాలయం వద్ద పడుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు


పెరియప్ప, చంద్ర తదితరులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

టీడీపీలోకి వంద కుటుంబాలు

- కేంద్ర కార్యాలయంలో చేరిక
- సూపర్ సిక్స్ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న చంద్రబాబు

రామకుప్పం, జనవరి 4: రామకుప్పం మండలం బల్ల, బందార్లపల్లె, కొంగనపల్లె, 89పెద్దూరు, గొరివిమాకులపల్లె పంచాయతీల పరిధిలోని వైసీపీకి చెందిన వంద కుటుంబాలవారు టీడీపీలో చేరారు. వీరంతా మంగళగిరిలో గురువారం చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బల్లకు చెందిన వైసీపీ రెబల్ సర్పంచు అభ్యర్థి చంద్ర, సీనియర్ నేతలు పెరియప్ప, మేస్త్రీవెంకటేష్, వెంకటాచలం, బందార్లపల్లె పంచాయతీకి చెందిన మంజునాథరెడ్డి, సుకుమార్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, సుబ్రహ్మణ్యం, గొరివిమాకులపల్లెకు చెందిన నూరుల్లా, రియాజ్, అష్రఫ్‌అలీ, కొంగనపల్లె పంచాయతీ కొళ్లపల్లెకు చెందిన గోవిందప్ప, 89పెద్దూరు పంచాయతీకి చెందిన శ్రీనివాసులు, మురుగేష్‌తో పాటు మిగిలిన వారికి చంద్రబాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు.. గ్రామాలాభివృద్ధిలో వైసీపీ నిర్లక్ష్యాన్ని ప్రచారాంశాలుగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని చంద్రబాబు సూచించారు. కుప్పం నియోజకవర్గంలో భారీ మెజారిటీ అందించేందుకు నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ కార్యక్రమాలను గడప-గడపకు వెళ్ళి ఓటర్లకు వివరించాలన్నారు. కుప్పం నియోజకవర్గంలో టీడీపీ నేతలు, కార్యకర్తలతో పాటు.. వైసీపీలోనూ సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న వారిపైనా అధికార పార్టీ నేతలే దాడులు చేయడం, అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. వైసీపీ అరాచక విధానాలు నచ్చకే ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో టీడీపీలో చేరుతున్నారన్నారు. రానున్న కాలంలో వైసీపీకి మనుగడే లేదన్నారు. టీడీపీ అధికారం చేపట్టాక ప్రజల్లో భయాన్ని పోగొట్టి, అభివృద్ధి, సంక్షేమం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారిశ్రీనివాసులు, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ అంజినేయరెడ్డి, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, నేతలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో ఎవరు చేరినా మాకు ప్రత్యర్థులే

- వైఎస్ షర్మిలను ఉద్దేశించి మంత్రి పెద్దిరెడ్డి వ్యాఖ్యలు
- జడ్పీటీసీగా ఓడిపోయిన బాబును ఎమ్మెల్యేను చేశాం

చిత్తూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో ఎవరు చేరినా తమ రాజకీయ ప్రత్యర్థిగానే చూస్తామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో వైఎస్ షర్మిల చేరికపై గురువారం చిత్తూరులో మంత్రిని మీడియా ప్రతినిధులు స్పందన కోరగా.. ఆయనిలా స్పందించారు. తమ పార్టీకి, సీఎం జగన్‌కు వ్యతిరేకంగా పనిచేసేవారిని ప్రతిపక్షంగానే చూస్తామన్నారు. 'కాంగ్రెస్‌లో, టీడీపీలో ఎవరు చేరినా, చేరకపోయినా మా నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డే. ఆయనకే మా మద్దతు ఉంటుంది. 16 నెలలు జగన్‌ను జైలుకు పంపించిన వారంతా కుటుంబాలనే కాదు మనుషులనే చీల్చే పరిస్థితి ఏర్పడింది' అని విమర్శించారు. వైసీపీలో దళిత ఎమ్మెల్యేలకు విలువ లేదని, సర్వే పేరుతో టికెట్ ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని, వ్యతిరేకత ఉన్నా ఓసీలకు మళ్లీ సీట్లు ఇస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు చేసిన విమర్శలను మంత్రి పెద్దిరెడ్డి వద్ద మీడియా ప్రతినిధులు ప్రస్తావించారు. దీనిపై ఎంఎస్ బాబు ఆత్మ విమర్శ చేసుకోవాలని మంత్రి సూచించారు. జడ్పీటీసీగా ఓడిపోయిన వ్యక్తిని తీసుకొచ్చి ఎమ్మెల్యేగా గెలిపించామనేది గుర్తు చేసుకోవాలన్నారు. ఇంగిత జ్ఞానం లేకుండా ఎవరో చెప్పిన మాటలు విని రెచ్చిపోయి మాట్లాడటం సరికాదన్నారు. ఇప్పటికైనా ఆయన తప్పు తెలుసుకుని వైసీపీ కోసం పనిచేయాలన్నారు.

అంగన్వాడీల జల దీక్ష


కార్వేటినగరంలోని పద్మసరస్సులో అంగన్వాడీ కార్యకర్తల నిరసన

చిత్తూరు, జనవరి 4: తమ సమస్యలను పరిష్కరించాలంటూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె గురువారంతో 24వ రోజుకు చేరింది. సీడీపీవో, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలను చేపట్టారు. కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపిన అంగన్వాడీలు పద్మసరస్సు చెరువు వద్దకు చేరుకున్నారు. ఆ చెరువులో నిలబడి జల నిరసన దీక్ష చేశారు. సీఎం ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండు చేశారు. చిత్తూరులో గురువారం ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘ నేతలు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టారు. 24 రోజులుగా నిరసనలు, ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. బుధవారం జరిగిన కలెక్టరేట్ ముట్టడికి వెళ్లే సమయంలో తమను పోలీసులు నిర్బంధించడానికి నిరసనగా కుప్పంలో అంగన్వాడీలు నిరసన గళం విప్పారు. పోలీసుల చర్యను వ్యతిరేకిస్తూ దీక్షా శిబిరంలో పడుకుని నిరసన తెలిపారు. కలెక్టరేట్ ముట్టడి సందర్భంగా పోలీసులతో విచక్షణా రహితంగా మహిళలని కూడా చూడకుండా ఈడ్చి లాగి పడేయడం బ్రిటిష్ రాజ్యాన్ని తలపించిందని యూనియన్ నేతలు ధ్వజమెత్తారు. పలమనేరులో అంగన్వాడీల నిరసనకు సీఐటీయూ నేతలు సంఘీభావం తెలిపారు. పుంగనూరు సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిరసన కొనసాగించారు. అంగన్‌వాడీలకు రూ.26 వేల జీతం, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చే వరకు సమ్మె విరమించేది లేదని భీష్మించారు.


కుప్పం శిబిరంలో పడుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

పొలం కంచెలో ఇరుక్కుని జింక మృతి



శాంతిపురం, జనవరి 4: పొలం కంచెలో ఇరుక్కుని ఓ జింక మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో వెంకటేపల్లె గ్రామ సమీపంలోని యల్లమ్మ దేవాలయం దగ్గర మామిడి తోటలో నుంచి ఓ జింక శాంతిపురం - సోగడబల్ల గ్రామీణ రహదారి దాటుతోంది. ఈ క్రమంలో మరో వైపు ఎత్తయిన కంచెను దాటడానికి వేగంగా వెళ్లి అందులో ఇరుక్కుని చనిపోయింది. రోడ్డులో వెళ్లే ప్రయాణికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. డీఆర్వో పుల్లయ్య తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. జింక కళేబరాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం అటవీశాఖ కార్యాలయానికి తీసుకెళ్లారు. వెటర్నరీ డాక్టరు అందుబాటులో లేకపోవడంతో శుక్రవారం పోస్టుమార్టం పూర్తిచేసి.. దహనం చేస్తామని డీఆర్వో తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం



అమ్ము

పాలసముద్రం, జనవరి 4: పాలసముద్రం మండలం తిరుమలరాజుపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న అమ్ము బుధవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదు. ఈ మేరకు కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. నరసింహాపురం పంచాయతీ అయ్యవారి కండ్రిగకు చెందిన రాము, పంకజవల్లి దంపతుల కుమార్తె అమ్ము 8వ తరగతి చదువుతోంది. వీరి గ్రామానికి, పాఠశాలకు మధ్య రెండు కిలోమీటర్లకుపైగా దూరం ఉంది. బుధవారం సాయంత్రం ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆమె సహచర విద్యార్థులను విచారించారు. పలమనేరుకు చెందిన వీరి దూరపు బంధువు గోవిందమ్మ.. గ్రామానికి కొంత దూరంలో ఆటోలో అమ్మును తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు గోవిందమ్మకు ఫోను చేయగా.. స్విచ్ఆఫ్ వచ్చింది. దీంతో కంగారుపడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌చార్జి ఎస్‌ఐ షేక్షావలి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు పలమనేరు వెళ్లి విచారించగా, అక్కడ గోవిందమ్మ ఇంటికి తాళాలు వేసి ఉన్నాయి. కేసు దర్యాప్తులో ఉంది.

పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య



రసజ్ఞ (ఫైల్ ఫొటో)

పలమనేరు, జనవరి 4: పలమనేరు మహిళా పాలిటెక్నిక్‌లో ట్రిపుల్‌ఈ చదువుతున్న రసజ్ఞ(17) గురువారం ఉదయం హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పలమనేరు మండలం శ్రీరంగరాజపురం గ్రామానికి చెందిన రసజ్ఞ ఈనెల 3వ తేదీన కళాశాలకు వచ్చింది. గురువారం ఉదయం తనకు ఆరోగ్యం సరిగా లేదని సెలవు చీటీ పంపింది. తోటి విద్యార్థులందరూ కళాశాలకు వెళ్లాక హాస్టల్ గదిలోనే ఉరేసుకుంది. విషయం తెలుసుకున్న కళాశాల సిబ్బంది ఆమెను వెంటనే పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థిని మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని శవపరీక్షకు తరలించి, పలమనేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె



కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 4: రెగ్యులర్, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు స్థానిక కలెక్టరేట్ ముందు చేపట్టిన సమ్మె గురువారానికి 16వ రోజుకు చేరింది. తమ సమస్యలు పరిష్కరించే వారకు సమ్మె విరమించేది లేదని తేల్చి చెప్పారు. వీరికి మద్దతు తెలిపిన సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నరసింహ, జిల్లా అధ్యక్షుడు గంగరాజు, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్‌లు ప్రభుత్వం మొండి వైఖరిని ఖండించారు. సమ్మెలో జేఏసీ నాయకులు చందు, హరి, దేవరాజులు, శ్రీనివాసులు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రచార వేదికగా పింఛన్ల సభ



లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి తదితరులు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 4: సామాజికి పింఛన్లు అందజేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని అధికార పార్టీ ప్రచార వేదికగా మార్చుకుంది. ప్రభుత్వం అందించిన ప్రయోజనాలను గుర్తుంచుకుని, వచ్చే ఎన్నికల్లో వైసీపీకే ఓటేసి గెలిపించాలని ప్రజాప్రతినిధులు, నాయకులు కోరారు. చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో కలెక్టర్ షన్మోహన్ అధ్యక్షతన గురువారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రూ.3 వేల పింఛను జగనే ఇస్తున్నారని.. అందుకని వైసీపీకి ఓటేయాలని ప్రభుత్వ కార్యక్రమంలో కోరడం విమర్శలకు తావిచ్చింది. తమకు కలిగిన ప్రయోజనం వివరించాలని పలువురు మహిళలను వేదికపైకి పిలవగా వారు ముక్తసరిగా 'స్క్రిప్టు' వినిపించి వెళ్లారు. జిల్లాలోని 2,76,008 పింఛనుదారులకు రూ.80.90 కోట్ల మొత్తాన్ని అందించనున్నారు. చిత్తూరు నియోజకవర్గం సంబంధించి మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, కలెక్టర్ షన్మోహన్, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ సురేష్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జోనల్ చైర్‌పర్సన్ శైలజారెడ్డి, జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు తులసి, రాధమ్మ, కమిషనర్ అరుణ, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, టీటీడీ మాజీ సభ్యుడు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో పండుగ ఎద్దు మృతి



రామకుప్పం, జనవరి 4: రామకుప్పం మండలం గిడ్డపల్లెలో వెంకటేశ్ అనే రైతుకు చెందిన పండుగ ఎద్దు శుక్రవారం పాముకాటుకు గురై మృతి చెందింది. జిల్లాతోపాటు, తమిళనాడులో జరిగిన పలు మైలారు పండుగల్లో మెరుపువేగంగా దూసుకెళ్లి ఈ ఎద్దు వెంకటేశ్ ఎన్నో బహుమతులు తెచ్చిపెట్టింది. రెండు నెలల క్రితం తమిళనాడువాసులు రూ.10లక్షలకు కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చినా విక్రయించలేదని వెంకటేశ్ తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.31 కోట్లు

తిరుమల, జనవరి4(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.31 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 65,514 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 20,394 మంది తలనీలాలు సమర్పించారు.

నేడు డయల్ యువర్ టీటీడీ ఈవో

తిరుమల అన్నమయ్య భవన్‌లో శుక్రవారం డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డితో నేరుగా మాట్లాడవచ్చు. దీనికోసం 0877 2263261 నంబరును సంప్రదించాల్సి ఉంటుంది.

ఎవరికి టికెట్ వచ్చినా గెలిపించుకుందాం

● తిరుపతిలో బలిజ ప్రముఖుల సమావేశంలో తీర్మానం

తిరుపతి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఈనెలాఖరున భారీ ఎత్తున వనభోజనాలు నిర్వహించాలి.. వచ్చే ఎన్నికల్లో సామాజికవర్గం నుంచీ ఎవరికి టికెట్ దక్కినా కలసికట్టుగా గెలిపించుకోవాలి... ఇవీ గురువారం తిరుపతిలో జరిగిన బలిజ ప్రముఖుల సమావేశంలో చేసిన తీర్మానాలు.తిరుపతి ఎన్‌జీవోకాలనీలోని బాస్ (బలిజ అభ్యుదయ సేవా సంఘం) కార్యాలయంలో టీడీపీ నేత ఊకా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బలిజ సామాజికవర్గానికి చెందిన పలువురు ముఖ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏటా నిర్వహించే తీరులోనే ఈ ఏడాది కూడా వనభోజనాలు నిర్వహించే విషయమై తొలుత చర్చించారు. తిరుపతి నగరంతో పాటు చంద్రగిరి, శ్రీకాళహస్తి, జీడీనెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు, పుంగనూరు, మదనపల్లె, తంబళ్ళపల్లి, పీలేరు, రైల్వేకోడూరు తదితర ప్రాంతాల నుంచీ కూడా భారీ ఎత్తున బలిజ సామాజికవర్గాన్ని వనభోజనాలకు ఆహ్వానించాలని నిర్ణయించారు. కనిష్టంగా పది వేల నుంచీ గరిష్టంగా పదిహేను వేలమందితో ఘనంగా జరపాలని నిశ్చయించారు. ఎక్కడ నిర్వహించాలన్న దానిపై ఒకటి రెండు స్థలాలు చూశాక నిర్ణయం తీసుకోవాలన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా ఎన్నికలు రెండు నెలల సమీపానికి వచ్చిన నేపథ్యంలో రాజకీయంగానూ చర్చ జరిగింది. టీడీపీ, జనసేన పార్టీల నడుమ పొత్తు కుదిరిన నేపథ్యంలో ఉమ్మడి అభ్యర్థిగా బలిజల్లో ఎవరికి అవకాశం వచ్చినా అందరూ కలసికట్టుగా గెలిపించుకోవాలన్న ప్రతిపాదన వచ్చిందని, సమావేశానికి హాజరైన ముఖ్యులందరూ ఈ ప్రతిపాదనను మూకుమ్మడిగా ఆమోదించినట్టు తెలిసింది. వైసీపీలో బలిజ సామాజిక వర్గానికి ఎమ్మెల్యే టికెట్ అవకాశం లేని నేపధ్యంలో టీడీపీ, జనసేన పార్టీల్లోనే అవకాశాలున్నాయని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడినట్టు సమాచారం. అందువల్లే సమావేశానికి ప్రధానంగా ఆ రెండు పార్టీలకు చెందిన నాయకులు అందరూ హాజరైనట్టు తెలిసింది. రాజకీయపరమైన చర్చలకు, నిర్ణయాలకు సంబంధించి తరచూ సమావేశం కావాలని, పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని తీర్మానించుకున్నట్టు తెలిసింది. కాగా సమావేశానికి టీడీపీ నుంచీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఊకా విజయ్‌కుమార్, కోడూరు బాలసుబ్రమణ్యం, జనసేన నుంచీ డాక్టర్ హరిప్రసాద్, కిరణ్ రాయల్, ఎడిఫై స్కూలు కరస్పాండెంట్ ప్రణీత్ తదితరులతో పాటు పలువురు రిటైర్డు ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

గ్రామకంఠంలో పునాదులు

● అధికార పార్టీ నేతల చర్యను అడ్డుకున్న గ్రామస్తులు
● అధికారులకు ఫిర్యాదు



పునాది పనులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

శాంతిపురం, జనవరి 4 : రాళ్లబూదుగూరు గ్రామంలో వెంకటేశ్వరస్వామి దేవాలయం పక్కన ఉన్న కొండగుట్టలోని గ్రామకంఠాన్ని అధికార పార్టీకి చెందిన ఒకరు ఆక్రమించారు. ఇంటి పునాదులు నిర్మిస్తుండగా విషయం తెలుసుకున్న గ్రామస్తులు గురువారం వెళ్లి అడ్డుకున్నారు. ఎన్నో ఏళ్లుగా దేవాలయానికి, కోనేరుకు మధ్య ఎటువంటి అడ్డంకులు ఉండకూడదనే ఈ గ్రామకంఠంలో ఎవరూ ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని తీర్మానించుకున్నామని తెలిపారు. అటువంటిది ఎవరి అనుమతితో ఇంటి నిర్మాణం చేపడుతున్నారంటూ నిలదీశారు. దాంతో ఆక్రమణదారులు పనులు ఆపేసి పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలంటూ రెవెన్యూ అధికారుల వద్దకెళ్లారు. ఇది తెలుసుకున్న గ్రామస్తులు కూడా మండల సచివాలయం వద్దకు చేరుకుని కొండగుట్టలోని గ్రామకంఠంలో ఎవరికీ ఎలాంటి ఇంటి స్థలాలకు కానీ, ఇతర నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని తహసీల్దార్ కొలేష్‌కు విజ్ఞప్తి చేశారు. అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను వెంటనే తొలగించాలని కోరారు. అలాగే స్థానిక సర్పంచ్ లక్ష్మికి కూడా విన్నవించుకున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇలాంటి ఆక్రమణలు చేయడం సరికాదని గ్రామస్తులు జి.శ్రీనివాసులు, ఎంబీ గోవిందరాజులు, ఎంఆర్ నారాయణ, కేవీ కృష్ణమూర్తి, రామప్ప, అరుణకుమార్, శ్రీనివాసులుగౌడు, బసవరాజు, ఆర్ఎస్ మణి, జయరాజ్, కుమార్ తదితరులు మండిపడ్డారు.

సర్పంచులకు నిధులు, గౌరవమేదీ?

● రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ విమర్శ



వెదురుకుప్పం మండలం సీఆర్‌కండ్రిగలో కరపత్రమిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత చింతామోహన్

శ్రీరంగరాజపురం/వెదురుకుప్పం, జనవరి 4: రాష్ట్రంలోని సర్పంచులకు వైసీపీ ప్రభుత్వం నిధులు, గౌరవం, గుర్తింపు ఇవ్వలేదని కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ విమర్శించారు. శ్రీరంగరాజపురం మండలం 49.కొత్తపల్లెమిట్టలో గురువారం జరిగి 'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి' కార్యక్రమంలో భాగంగా ఆయన కరపత్రాలు పంచి.. మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక చాలామంది చదువు మానేస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, మండల అధ్యక్షుడు తులసిమణి, మహిళా నేత చందురాణి, మణికృష్ణ, కన్నన్, సుబ్బరాయులు, పుష్పరాజ్, బుజ్జిరెడ్డి, నారాయణ, పరదేశి, రాణియాదవ్, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. అలాగే, వెదురుకుప్పం మండలం సీఆర్‌కండ్రిగలోనూ చింతా మోహన్ పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్నాయని విమర్శించారు. దళిత, గిరిజనులకు చెందాల్సిన సంక్షేమ పథకాలను పక్కదారి పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ షర్మిల పార్టీలో చేరడం శుభపరిణామని పేర్కొన్నారు. జిల్లా నేతలతో పాటు పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సోడెం నరసింహులు, జీడీనెల్లూరు అసెంబ్లీ కన్వీనర్ నారాయణస్వామి, మండల పార్టీ అధ్యక్షుడు కందుకూరి హుమేశ్, నేతలు మునికృష్ణ, బుల్లెట్ రవి, సర్పంచి పోటుగారి లలిత తదితరులు పాల్గొన్నారు.

'హిందూ సనాతన ధర్మం చాలా గొప్పది'



పుంగనూరులో ర్యాలీ చేస్తున్న హిందూ జాగరణ సమితి, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు

పుంగనూరు, జనవరి 4: 'హిందూ సనాతన ధర్మం చాలా గొప్పది. ప్రతి ఒక్క హిందువు ఐక్యంగా ఉంటూ.. ఎక్కడ ఆలయాలపై దాడులు జరిగినా ప్రతిఘటించాలి' అని హిందూ చైతన్య ధర్మ ప్రచార సేవక్ రాధా మనోహర్‌దాస్ పిలుపునిచ్చారు. గురువారం పుంగనూరు హిందూ జాగరణసమితి, ఆర్ఎస్ఎస్, బీజేపీ తదితరులు రాధామనోహర్‌దాస్‌తో కలసి శాంతి ర్యాలీ నిర్వహించారు. ఇటీవల పుంగనూరు ఏటిగడ్డపాళ్యం ధనకొండగంగమ్మ ఆలయంపై రాళ్లు, చెప్పులు, కర్రలు విరిసి పలువురు దళితులపై దాడి చేయడంతో ఆలయాన్ని సందర్శించి, బాధితులతో మాట్లాడేందుకు సిద్ధమయ్యారు. కానీ రాధామనోహర్‌దాస్, హిందువులు ర్యాలీగా వెళితే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని పోలీసులు ఆలయం వద్దకు వెళ్లడానికి అనుమతి ఇవ్వలేదు. దాంతో వారు శ్రీకళ్యాణ వెంకటరమణస్వామిని దర్శించుకుని తూర్పు మొగసాల చాముండేశ్వరి అమ్మవారి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏటిగడ్డపాళ్యం దళితులు, మహిళలతో దాస్ మాట్లాడారు. పోలీసుల సూచనతో గంగమ్మ ఆలయం వద్దకు వెళ్లలేదన్నారు. మరోసారి దేవాలయాలపై దాడులకు పాల్పడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. త్రిమూర్తిరెడ్డి, శివకుమార్, పరమేశ్, నానబాలకుమార్, బాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'చాట్‌బాట్'తో చోరీ అయిన సెల్‌ఫోన్ల రికవరీ : ఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చౌడేపల్లె, జనవరి 4: చాట్‌బాట్ ద్వారా చోరీ అయిన సెల్‌ఫోన్లను రికవరీ చేస్తున్నట్లు చిత్తూరు ఎస్పీ రిశాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేశారు. 'సెల్‌ఫోన్ చోరీ అయిన వారు వెంటనే 94409 00004 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్ అని మెసేజ్ టైప్ చేయాలి. తర్వాత వెల్‌కమ్ చిత్తూరు పోలీస్ పేరున ఓ లింకు వస్తుంది. ఆ లింకులో గూగుల్ ఫార్మాట్ ఓపెన్ అవుతుంది. అందులో సెల్‌ఫోన్ తాలూకు వివరాలు నమోదు చేయాలి ఇది ఓ పద్ధతి, రెండో పద్ధతిలో సీఈఐఆర్ (ఇుటబుజా ఉుఊఊబిఇర్బుస్ట ఐర్చిస్టుబజీడ ఖుఇజీబ్దట) ద్వారా వివరాలు నమోదు చేయొచ్చు' అని ఎస్పీ వివరించారు. ఈ విషయాలు తెలియనివారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయొచ్చన్నారు. చౌడేపల్లె బస్టాండులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మరో వారంలో చౌడేపల్లెకు మరో ఎస్ఐని నియమించనున్నట్లు చెప్పారు. పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, పుంగనూరు రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఏఎస్ఐ వాసు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

జడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 4: జిల్లా ప్రజాపరిషత్తు సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 6న జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి గురువారం తెలిపారు. తదుపరి సమావేశ తేదీని త్వరలో తెలియజేస్తామని వివరించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పీజీటీలకు ఇంక్రిమెంట్ ఇవ్వండి: కంచర్ల

కుప్పం, జనవరి 4: రాష్ట్ర ప్రభుత్వం ప్లస్ టూకు అప్‌గ్రేడ్ చేసిన పాఠశాలల్లో పనిచేస్తున్న పీజీటీ (పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు)కు వెంటనే ఇంక్రిమెంట్ చెల్లించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి, పాఠశాల విద్య కమిషనర్‌కు తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ గురువారం లేఖ రాశారు. ప్రభుత్వం 292 ప్రభుత్వ, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలను ప్లస్ టూ పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసిందన్నారు. ఈ పాఠశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల బోధనకు పోస్ట్ గ్రాడ్యుయేట్ అర్హతలు కలిగిన ఉపాధ్యాయుల నుంచి ఆప్షన్ తీసుకుని, సీనియారిటీ ప్రాతిపదికన కౌన్సెలింగ్ నిర్వహించి బోధన చేయిస్తున్నదన్నారు. దీనికిగాను పీజీటీలకు అదనంగా ఇంక్రిమెంట్ మంజూరు చేస్తామంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్న అంశాన్ని గుర్తుచేశారు. అందువల్ల పీజీటీలకు ఇంక్రిమెంట్ మంజూరు చేసి, జీతం చెల్లించాలని ఎమ్మెల్సీ కంచర్ల డిమాండ్ చేశారు.

వలంటీర్లతో మున్సిపల్ చైర్మన్ సమీక్ష

కుప్పం, జనవరి 4: తన కార్యాలయంలో గురువారం వార్డు వలంటీర్లతో కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ సమీక్షించారు. మున్సిపల్ పరిధిలో ప్రతి నెలా రూ.2కోట్ల పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కొత్తగా మంజూరైన పెన్షన్ల పంపిణీ

సోమల, జనవరి 4: ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో మండలానికి కొత్తగా మంజూరైన 101 పింఛన్లు గురువారం పంపిణీ చేశారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి, ఎంపీడీవో నాగరాజ, ఎంపీపీ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ ప్రభాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్లు మోహన్, నాగేశ్వరరావు, గంగాధరం, వీవీ రమణ, రాశెట్టి మధు, సాంబశివయ్య, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండలంలో 4799మందికి, నూతనంగా మంజూరైన 50 మందికి కలిపి రూ.1,38,42000 పంపిణీ చేశామని ఎంపీపీ పురుషోత్తంరెడ్డి తెలిపారు. ఎంపీడీవో రాజేంద్ర, జడ్పీటీసీ రెడ్డీశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ నూలు రెడ్డెప్ప, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వృద్ధులకు ప్రభుత్వం పెంచిన పింఛన్లు అందజేశారు. ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, ముడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్, ఎంపీడీవో నారాయణ, వైసీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ట్రస్ట్ ఉచిత వైద్య శిబిరం



కుప్పం, జనవరి 4: గుడుపల్లె మండలం కనమనపల్లె గ్రామంలో గురువారం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 80 మంది రోగులకు బీపీ, షుగర్, ఇతర వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు ఉచితంగా పంపిణీ చేశారు. డాక్టర్ మధు, ఝాన్సీ, రాణి, పార్థసారథి వైద్య సేవలు అందించారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



కల్లూరు, జనవరి 4: పులిచెర్ల ఎంఈవో కార్యాలయం ఆవరణంలో గురువారం ఎంఈవోలు శిద్ధరామయ్య, పోకల తాతయ్యలు యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ మహేంద్ర, మండల అధ్యక్షుడు హరినాథ్, ప్రధాన కార్యదర్శి రెడ్డెప్ప, నాయకులు సీవీ రమణ, మహమ్మద్ రఫీ, వెంకటశివ, కళావతి, కరుణాకర్‌రెడ్డి, చలపతి, ప్రసాద్, ఆలీషా, కామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి



ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో రాజశేఖర్ తదితరులు

కల్లూరు, జనవరి 4: కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ కార్యాలయం ఆవరణంలో గురువారం సర్పంచ్ షకూర్ అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ (పీఎంజేఏవై) కార్డులు పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో ఏపీవో షౌకత్, ఏపీఎం చంద్రమోహన్, బ్యాంకు అధికారి పృథ్వీ, డాక్టర్ జానకీరావు, పంచాయతీ కార్యదర్శి యుగంధర్, ఎంపీటీసీ సభ్యులు రెడ్డిఅహ్మద్, మంజుల మునస్వామి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



అబకలదొడ్డి గ్రామస్తులకు విరాళం అందిస్తున్న జడ్పీటీసీ శ్రీనివాసులు

శాంతిపురం, జనవరి 4: అబకలదొడ్డి గ్రామంలోని సోమేశ్వరస్వామి శివాలయం నిర్మాణానికి శాంతిపురం జడ్పీటీసీ శ్రీనివాసులు రూ.51,000 విరాళంగా ఇచ్చారు. వందల ఏళ్లనాటి ఆలయాన్ని గ్రామస్తులు జీర్ణోద్ధరణ చేస్తున్నారు. దాంతో తనవంతుగా ఈ మొత్తాన్ని అందజేసినట్లు జడ్పీటీసీ తెలిపారు. సర్పంచ్ భర్త చిన్నప్ప, గోవిందప్ప, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం




శివరాం - ఇమ్రాన్

సోమల, జనవరి 4: ఎస్టీయూ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు జిల్లా నాయకులు జ్యోతీశ్వరుడు, జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సోమల హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా వడ్డిపల్లె శివరాం, ప్రధాన కార్యదర్శిగా ఇమ్రాన్, గౌరవాధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా హరీశ్‌బాబును ఎన్నుకున్నారు. సి.సూర్యప్రకాశ్, బి.శ్రీనివాసులును జిల్లా కార్యదర్శులుగా ఎంపిక చేశారు.

మహిళా టీచర్లకు సన్మానం



ఎంఈవో సాయిలీలను సన్మానిస్తున్న టీచర్లు

బైరెడ్డిపల్లె, జనవరి 4: పాతపేట ప్రాథమిక పాఠశాలలో గురువారం సావిత్రీబాయి పూలే జయంతి ఉత్సవాల సందర్భంగా ఎంఈవో సాయిలీలతో పాటు మహిళా ఉపాధ్యాయులు ప్రభావతి, స్వాతి, పుష్పను సన్మానించారు. హెచ్ఎం ప్రకాష్, ఎంఈవో-2 సుబ్రహ్మణ్యం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలు

సోమల, జనవరి 4: ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను సామాజిక తనిఖీ బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. గురువారం పెద్దఉప్పరపల్లె, నంజంపేట హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని, సర్వశిక్ష కింద చేపట్టిన పనులను పరిశీలించారు. అలాగే నెల్లిమంద పంచాయతీలో సీసీ రోడ్లు, అవెన్యూ ప్లాంటేషన్ పనులు తనిఖీ చేసి రికార్డులను ఎస్ఆర్పీ నాగరాజ పరిశీలించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు



ఫజులూపేటలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సహదేవ

రొంపిచెర్ల, జనవరి 4: చంద్రబాబు మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కె.సహదేవ అన్నారు. గురువారం బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో పుంగనూరు నియోజకవర్గంలో చల్లా రామచంద్రారెడ్డి విజయానికి సహకరించాలని కోరారు. మాజీ వైస్ సర్పంచ్ బాబు, జలీల్ బాష, అబ్దుల్‌రహీం తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి క్రికెట్ టోర్నీ

సోమల, జనవరి 4: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో శనివారం నుంచి దివంగత పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విన్నర్స్‌కు రూ.39,999, రన్నర్స్‌కు రూ.19,999 నగదు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. శుక్రవారం ఎంట్రీలకు చివరి రోజన్నారు.

సీఎం వైఖరితో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకం

- పొరుగు రాష్ట్రాలకు తరలిపోతున్న పరిశ్రమలు
- మాజీ మంత్రి అమరనాథరెడ్డి



చిన్నారిని ఎత్తుకుని స్థానికులతో మాట్లాడిన అమరనాథరెడ్డి

పలమనేరు, జనవరి 4: సీఎం జగన్ వైఖరితో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. గురువారం పలమనేరు మండలం పెంగరగుంట పంచాయతీలో ఇంటింటికీ తెలుగుదేశం, బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నిరంకుశ విధానాలతో పలు పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అమరరాజ కంపెనీ తెలంగాణకు తరలివెళ్లి అక్కడ పెట్టుబడులు పెడుతున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. భావితరాలు బాగుండాలన్నా.. రాష్ట్రం అన్నిరంగాల్లో ముందుకెళ్లాలన్నా చంద్రబాబును రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముసలిమడుగుకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. అనంతరం పెంగరగుంట పంచాయతీలోని తావడపల్లి, జంగాలపల్లి, కోతిగుట్ట, పెంగరగుంట, చిన్నకుంట, ముసలిమడుగు,బండమీదిండ్లు, ఏటిగడ్డఇండ్లు, ఇందిరానగర్‌లో పర్యటించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు నాగరాజురెడ్డి, ప్రధానకార్యదర్శి గణేష్, సర్పంచ్ నక్షత్రయ్య, భువనేశ్వరమ్మ, రామచంద్ర, నాయకులు మల్లీశ్వరరెడ్డి, జగదీష్‌నాయుడు, వెంకటమునిరెడ్డి, శివకుమారి, జనసేన నాయకులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ పాలనకు గుణపాఠం తప్పదు

- ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారు
- చల్లా రామచంద్రారెడ్డి



కుమ్మరగుంటలో పర్యటిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు రూరల్, జనవరి 4: రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలకు, దోపిడీ పాలనకు గుణపాఠం తప్పదని, ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని వనమలదిన్నె, కుమ్మరగుంట, కొండందొడ్డి, మిర్జేపల్లె, ఓబిరెడ్డిపల్లె గ్రామాల్లో పర్యటించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతుండగా.. ప్రస్తుత ప్రభుత్వంలో సక్రమంగా అందడంలేదని ప్రజలే చెబుతున్నారన్నారు. అందువల్ల ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీడీపీకి ఓటేయడానికి జనం సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరు నియోజకవర్గంలో యువతకు ఒక్క పరిశ్రమ ఏర్పాటు చేసిన దాఖలాలు లేవన్నారు. టీడీపీ నాయకులు మాధవరెడ్డి, శ్రీకాంత్, సుబ్రహ్మణ్యంరాజు, ఆసూరి బాలాజి, అమరేంద్ర, మోహన్, విజయ్‌కుమార్, సీవీరెడ్డి, పోలీస్‌గిరి, గంగాధర్, మంజునాథ్, చిన్న మోహన్ నాయుడు, వెంకటరమణ, బాలప్ప, శంకర, ప్రసాద్ స్వామి, భాస్కర్ నాయుడు, నాగరాజ, విరూపాక్షి, రాఘవ, జనసేన నాయకులు పగడాల రమణ, చిన్నారాయల్, విరూపాక్షి, బాలాజీ నాయక్, హరినాయక్, నరేశ్‌రాయల్, చైతన్యరాయల్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్వాడీల నిరసన



పలమనేరులో అంగన్వాడీలతో మాట్లాడుతున్న నరసింహులు

పలమనేరు, జనవరి 4: ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగుతుందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు తెలిపారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన దీక్షలో ఉన్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. జిల్లా నాయకుడు గంగరాజు మాట్లాడుతూ.. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించక పోగా వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. నాయకులు శాంతి, పద్మ, లక్ష్మి, ఓబుల్‌రాజు, గిరిధరగుప్తా తదితరులు ప్రసంగించారు.

శాంతిపురం, జనవరి 4: శాంతిపురం మండలంలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె గురువారంతో 24వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆటలు ఆడుతూ.. పాటలు పాడుతూ.. నృత్యాలు చేశారు. తమ కష్టాలు ఈ గుడ్డి ప్రభుత్వానికి పట్టడం లేదని నినాదాలు చేశారు. రామకుప్పం, శాంతిపురం అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.



పుంగనూరు రూరల్, జనవరి4: పోరాటాలు, ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని అంగన్వాడీ సంఘ జిల్లా అధ్యక్షురాలు వీఆర్ జ్యోతి అన్నారు. గురువారం పుంగనూరు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద కార్యకర్తలతో మాట్లాడుతూ సమ్మెను విజయవంతం చేయడానికి కట్టుబడి ఉండాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రనాథ్, అంగన్వాడీలు పాల్గొన్నారు.



నిర్బంధంపై అంగన్వాడీల నిరసన



కుప్పం, జనవరి 4: కుప్పంలో అంగన్వాడీల సమ్మె గురువారం కూడా కొనసాగింది. కలెక్టరేట్ ముట్టడికి వెళ్లే సమయంలో తమను ఎక్కడికక్కడ పోలీసులు నిర్బంధించడానికి నిరసనగా దీక్షా శిబిరంలో పడుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకురాలు లలిత, అంగన్వాడీ నేతలు మాట్లాడుతూ.. ఎన్ని నిర్బంధాలు విధించినా తమ గళం నొక్కలేరన్నారు. ఎన్నికల ముందు సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ముట్టడి సందర్భంగా పోలీసులతో విచక్షణా రహితంగా మహిళలని కూడా చూడకుండా ఈడ్చి లాగి పడేయడం బ్రిటిష్ రాజ్యాన్ని తలపించిందని దుమ్మెత్తిపోశారు. డిమాండ్లను సాధించుకునేదాకా ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన



కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పలమనేరు, జనవరి 4: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పలమనేరు మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ప్రధాన ద్వారం ఎదుట నిరసన చేపట్టారు. వీరికి సీఐటీయూ రాష్ట్రకార్యదర్శి నరసింహులు, జిల్లా నాయకుడు గంగరాజు, స్థానిక నాయకులు గిరిధరగుప్తా, ఓబుల్‌రాజు సంఘీభావం తెలిపారు. నాయకులు మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని జగన్ తన పాదయాత్రలో హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికీ నెరవేర్చక పోవడం దారుణమన్నారు. నిరంకుశంగా వ్యవహరిస్తున్న సీఎంకు రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండు చేశారు.

గ్రామాల్లో వైద్యసేవలపై శ్రద్ధ చూపాలి

బైరెడ్డిపల్లె, జనవరి 4: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్యసేవలందించడంలో ఆశా కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జగనన్న ఆరోగ్యసురక్ష నోడల్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం ఆశా కార్యకర్తలతో ప్రత్యేకసమావేశం నిర్వహించారు. జిల్లా స్టాటిస్టికల్ అధికారి జార్జ్, మీడియా ఎక్స్‌టెన్షన్ అధికారి జయరాముడు, వైద్యాధికారి విజయచందర్, శాలిని, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

'క్రికెట్, వాలీబాల్' కిట్ల పంపిణీ



పుంగనూరు, జనవరి 4: క్రీడాకారులను ప్రోత్సహించడానికి క్రికెట్, వాలీబాల్ క్రీడా కిట్లను అందజేస్తున్నట్లు విశ్రాంత డీఎస్పీ సుకుమార్ తెలిపారు. గురువారం స్థానిక హైస్కూల్ వీధిలో కిట్లను క్రీడాకారులకు అందజేశారు. శ్రీవాల్మీకి మహర్షి సేవా సంఘం, ప్రగతి దాత వలంటీర్ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలోని క్రీడాకారులకు కిట్లను అందజేస్తున్నట్లు చెప్పారు. దివంగత డేవిడ్, రాజప్రకాశ్‌ల జ్ఞాపకార్థంగా ఈ కార్యక్రమం చేస్తున్నట్లు వివరించారు.

కోర్టు స్టే ఉంటే కూడా పట్టించుకోరా..?

గుడిపాల, జనవరి 4: మండలంలోని పశుమందలో ఓ నేలకు సంబంధించి కోర్టులో స్టే ఉన్నా కొంతమంది అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టడానికి వస్తున్నారని గ్రామానికి చెందిన వాణి గురువారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఏఎస్ఐ చలపతి.. గ్రామస్తులు, బాధితురాలితో చర్చించి, తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

గోసంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



ఐరాల (కాణిపాకం), జనవరి 4: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలోని గోసంరక్షణ ట్రస్టుకు గుంటూరు జిల్లా తెనాలికి చెందిన నాగరాజకుమారి గురువారం రూ.1,00,116 విరాళంగా అందించారు. విరాళదాతకు ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ స్వామి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు.

డైట్‌లో ముగిసిన పరిశోధన శిక్షణ కార్యక్రమం



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ శేఖర్

కార్వేటినగరం, జనవరి 4: కార్వేటినగరం డైట్‌లో మూడు రోజులపాటు జరిగిన చర్యాత్మక పరిశోధన శిక్షణ కార్యక్రమం గురువారం తో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో డైట్ ప్రిన్సిపాల్ శేఖర్ మాట్లాడుతూ పాఠశాల తరగతి గదిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం ఈ శిక్షణ టీచర్లకు ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. తరగతి గదిలో విద్యార్థుల నుంచి ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి టీచర్లు తమ బోధన అనుభవాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో 30 మంది టీచర్లు పాల్గొన్నారు. డీఈవో విజయేంద్రరావు, ఎంఈవో విజయ్‌కుమార్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

జగన్ రెడ్డి ప్రభుత్వంపై తిరగబడుతున్న ప్రజలు: టీడీపీ



కరపత్రాలు ప్రదర్శిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జనవరి 4: జగన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజలు తిరగబడుతున్నారని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో జగన్ ప్రజావ్యతిరేక విధానాలపై కరపత్రాలను విడుదలచేశారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామాలు చేస్తున్నారని పేర్కొన్నారు. జగన్‌ను నమ్ముకుంటే తమ రాజకీయ భవిష్యత్తు అంధకారమేనని భావించిన చాలా మంది ప్రజాప్రతినిధులు పార్టీలు మారుతున్నారని అన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కు వెళ్లిందని పేర్కొన్నారు.కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు సునీల్ కుమార్, ప్రభు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఎం జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని జిల్లా పార్టీ అధ్యక్షుడు పులివర్తి నాని ఒక ప్రకటనలో తెలిపారు. అందుకే తమ ఎమ్మెల్యేలను, ఎంపీలను ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి మార్చుతున్నారని విమర్శించారు. రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని, చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని ఆ ప్రకటనలో ఆయన తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం : ఒకరి అరెస్ట్

కల్లూరు, జనవరి 4: కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ముందుగా అందిన సమాచారంతో పులిచెర్ల మండలం రాయవారిపల్లె పంచాయతీ గెలసంవారిపల్లె బస్టాండు కూడలి వద్ద తనిఖీలు చేపట్టారు. కర్ణాటకకు చెందిన ఎనిమిది మద్యం ఫుల్ బాటిళ్లతో మండలానికి చెందిన జనార్దన్ పట్టుబడ్డాడు. దాంతో నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు భోజన ప్లేట్ల వితరణ



సోమల, జనవరి 4: వడ్డిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు భోజన ప్లేట్లను పగడాల లక్ష్మీప్రసాద్ వితరణ చేశారు. ఈ పాఠశాలలో లక్ష్మీప్రసాద్ తల్లిదండ్రులు పగడాల కృష్ణమూర్తి, రాజమ్మలు 20 ఏళ్లు ఉపాధ్యాయులుగా పనిచేశారు. దాంతో ఈ పాఠశాలపై మక్కువతో 150 స్టీల్ ప్లేట్లను అందజేశారు. హెచ్ఎం సుబ్రహ్మణ్యం, జీసీకే ప్రసాద్, మహేశ్, డాక్టర్ నరసింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లెప్రసీ సర్వే జాగ్రత్తగా చేయాలి

సోమల, జనవరి 4: పీహెచ్‌సీల పరిధిలో జరుగుతున్న లెప్రసీ ఇంటింటి సర్వేని జాగ్రత్తగా చేయాలని కందూరు వైద్యాధికారి డాక్టర్ విజయకుమారి సూచించారు. కందూరు వైద్యశాలలో ఆశా డేని పురస్కరించుకుని జరిగిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. ఎంపీహెచ్‌వో కుమార్, సూపర్‌వైజర్ ప్రమీల, ఎల్‌హెచ్‌పీలు జయమ్మ, భూదేవి, హిమబిందు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

కల్లూరు, జనవరి 4: రోడ్డు ప్రమాదంలో గురువారం దంపతులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సోమల మండలం నంజంపేటకు చెందిన పాపులమ్మ, సుబ్రహ్మణ్యం దంపతులు ద్విచక్రవాహనంలో స్వగ్రామం నుంచి కల్లూరు వైపు వస్తున్నారు. పాతపేట క్రాస్ సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో భర్తకు తీవ్రగాయాలవగా భార్యకు స్వల్పగాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జనసేనలో చేరికలు



పలమనేరు, జనవరి 4: పలమనేరు జనసేన నియోజకవర్గ కన్వీనర్ పవుపులేటి దిలీప్ ఆధ్వర్యంలో గురువారం పలువురు యువకులు జనసేనలో చేరారు. మాజీ మంత్రి అమర్ సమక్షంలో వి.కోట మండలం తోటకనుమ గ్రామానికి చెందిన పలువురు లతిన్‌రెడ్డి, అతని స్నేహితులు, పెంగరగుంట పంచాయతీ కోతిగుట్ట గ్రామానికి చెందిన శ్రీరాములు, హరీష్, రామ్మూర్తి, రాజేష్, నవీన్, సదాశివ, రాజు, రమణ జనసేనలో చేరారు. జనసేన నాయకులు నాగరాజు, చందు, షణ్ముగం, అయాజ్, హరి, సాంబ, సంజయ్, మాధవ, సోము, తరుణ్, హరినాథ్, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

సంఘంలో అక్రమాలను ప్రశ్నిస్తే తొలగించారు

మున్సిపల్ కమిషనర్‌కి బాధితురాలి ఫిర్యాదు

పలమనేరు, జనవరి 4: శివశంకర్ స్వయం సహాయక సంఘంలోని అక్రమాలు ప్రశ్నిస్తే తనను సంఘం నుంచి తొలగించారని పలమనేరు రంగాపురానికి చెందిన లైలా ఆరోపించారు. ఈ మేరకు పలమనేరు కమిషనర్‌కి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. 'పదేళ్లుగా ఈ సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. ఇప్పటికే రూ.55000, రూ.20000, రూ.85000 రుణాలుగా తీసుకుని, సక్రమంగా చెల్లించాను. గత ఏడాది ఆగస్టులో రూ.8000 చెల్లించాల్సి ఉండగా, జనవరిలో రూ.9000 కట్టేశాను. అయినా ఆర్పీ ధనలక్ష్మి, లీడర్లు క్రిష్ణవేణి, కవిత కలిసి నన్ను సంఘం నుంచి తొలగించారు. విచారించి న్యాయం చేయండి' అని ఆ ఫిర్యాదులో లైలా పేర్కొన్నారు.

నేడు మామిడి రైతులకు అవగాహన

సోమల, జనవరి 4: సోమల, చౌడేపల్లె మండలాల మామిడి రైతులకు శుక్రవారం సోమల వెలుగు కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఉద్యానాధికారి సంతోషి కుమారి తెలిపారు. ఈకార్యక్రమానికి జిల్లా ఉద్యానాధికారి మధుసూదన్ రెడ్డి, శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులురెడ్డి హాజరై.. మామిడిలో పూత, పిందె దశల్లో తీసుకోవాల్సి జాగ్రత్తలు వివరించడం జరుగుతుందన్నారు.

టెన్త్ విద్యార్థినులకు పరీక్ష సామగ్రి వితరణ



బైరెడ్డిపల్లె, జనవరి 4: కమ్మనపల్లె కస్తూర్బా పాఠశాలలో టెన్త్ విద్యార్థినులకు గురువారం కల్యాణ్ ఫౌండేషన్ చైర్మన్ పవన్‌కల్యాణ్ పరీక్ష సామగ్రి వితరణ చేశారు. ఎస్వో స్వరూప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం



విశేషాలంకరణలో తిమ్మరాయస్వామి

బైరెడ్డిపల్లె, జనవరి 4: మండలంలోని వెంగంవారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత తిమ్మరాయస్వామి ఆలయంలో గురువారం వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేకపూజలు జరిపి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీవారు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

చంద్రబాబుతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు


బాబు ష్యూరిటీ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జనవరి 4: టీడీపీ అధినేత చంద్రబాబు పాలనతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు వస్తుందని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. గురువారం నగరంలోని 22వ డివిజన్ గంగనపల్లెలో బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దొరబాబు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా రాష్ట్రానికి టెక్నాలజీని తీసుకురావాలన్నా, ప్రసిద్ధి చెందిన కంపెనీలు పెట్టుబడులు పెట్టి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నా, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలన్నా చంద్రబాబుతోనే సాధ్యమని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిని, ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని పేర్కొన్నారు. ష్యూరిటీ పత్రాలను స్థానిక ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు కోదండ, హరి, ప్రభు, సుబ్రమణి, గోపి, తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: కార్వేటినగరం పంచాయతీ బూత్ నెంబర్ 91లో బాబు ష్యూరిటీ.. భవిషత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. టీడీపీ ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న వివిధ పథకాల గురించి ప్రజలకు నాయకులు వివరించారు. స్థానిక రాజ బంధువుల వీధిలో జరిగిన ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ సందాని, డేటా విశ్లేషకులు కిషోర్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: వైసీపీ పాలనలో అప్పు లెక్కువ, అభివృద్ధి శూన్యమని పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్ అన్నారు. మండలంలోని గుంతూరు, పెద్దవంక, కురప్పల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ద్రాక్షాయణి, ఎంపీటీసీ గోమతి, నాయకులు ఎన్‌పీ ధరణి నాయుడు, వాసుదేవ నాయుడు, కమల్‌నాథ రెడ్డి, సుదర్శన్ నాయుడు, శివ, వంశీ చౌదరి, జాకీర్ హుస్సేన్, హరిప్రసాద్, జనార్దన్ గౌడ్, హేమచంద్ర నాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


గుంతూరులో పాల్గొన్న టీడీపీ నాయకులు

శ్రీరంగరాజపురం: రాబోయే ఎన్నికలే వైసీపీ ప్రభుత్వానికి చివరి ఎన్నికలని టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు అన్నారు. మండలంలోని పిళ్లారికుప్పంలో బాబు ష్యూరిటీ, భవిషత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రజలకు తెలియజేయాలని ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. బూత్ కన్వీనర్ శ్రీహరిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, హైదార్, సోమేశ్వర్‌రెడ్డి, హేమాద్రి యాదవ్ పాల్గొన్నారు.

డైట్‌లో ముగిసిన పరిశోధన శిక్షణ కార్యక్రమం


మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ శేఖర్

కార్వేటినగరం, జనవరి 4: కార్వేటినగరం డైట్‌లో మూడు రోజుల పాటు జరిగిన చర్యాత్మక పరిశోధన శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో డైట్ ప్రిన్సిపాల్ శేఖర్ మాట్లాడుతూ పాఠశాల తరగతి గదిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం ఈ శిక్షణ టీచర్లకు ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. తరగతి గదిలో విద్యార్థుల నుంచి ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి టీచర్లు తమ బోధన అనుభవాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో 30 మంది టీచర్లు పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్ర రావు, ఎంఈవో విజయ్‌కుమార్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీలో సత్తా చాటాలి


కబడ్డీ క్రీడాకారులతో మంత్రి రోజా

నగరి, జనవరి 4: జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు వెళుతున్న అండర్-17 బాలురను గురువారం మంత్రి రోజా క్యాంపు కార్యాలయంలో ఆశీర్వదించి పంపారు. జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆమె వారికి సూచించారు. చౌడేపల్లిలో జరిగిన అంతర్‌జిల్లాల పోటీలలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు నగరి పట్టణంలో కోచింగ్ క్యాంపు జరుగుతోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి జిల్లాలో జరిగే పోటీలకు వెళుతున్న క్రీడాకారులకు మంత్రి రోజా ఆశీస్సులందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్, కోచ్‌లు మణి, రాజా, సుమన్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడం శుభపరిణామం
- పీసీసీ ప్రధాన కార్యదర్శి బాబు


స్వీట్లు పంచుతున్న కాంగ్రెస్ నాయకులు

నగరి, జనవరి 4: వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడం శుభపరిణామమని పీసీసీ ప్రధాన కార్యదర్శి బాబు పేర్కొన్నారు. నగరి పట్టణ పరిధిలోని టవర్ క్లాక్ వద్ద గురువారం సాయంత్రం టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ షర్మిల రాకను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఆనందంతో ఆహ్వానిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ఆంధ్రాలో పూర్వ వైభవం వచ్చే రోజులు దగ్గర పడ్డాయన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు భానుమూర్తి, పీసీసీ సభ్యులు నటరాజన్, నాయకులు కుమార్, అల్లాపిచ్చి, నాగేశ్వరరావు, సుబ్రమణ్యంరెడ్డి, గోపాల్, దివాకర్, కార్తీక్, గోపి గుణ పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ జయహో బీసీ సమావేశానికి తరలివెళ్లిన నేతలు


పాల్గొన్న బీసీ నేతలు

గంగాధరనెల్లూరు, జనవరి 4: మంగళగిరి కేంద్ర టీడీపీ కార్యాలయంలో పార్టీ అధినేత చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరైన టీడీపీ జయహో బీసీ సమావేశానికి గురువారం గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి చెందిన పలువురు బీసీ నేతలు తరలివెళ్లారు. జిల్లా టీడీపీ యాదవ సాధికారసమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, నియోజకవర్గ టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు రవి యాదవ్, కార్వేటినగరం మండల టీడీపీ అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, మాజీ సర్పంచ్ కుమార్‌యాదవ్, నెల్లేపల్లె టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు.


జయచంద్రతో నాయకులు

వెదురుకుప్పం: మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన జయహో బీసీ కార్యక్రమానికి వెదురుకుప్పం టీడీపీ నాయకులు గురువారం హాజరయ్యారు. వెదురుకుప్పంకు చెందిన దాసరి సాధికార కమిటీ జిల్లా అధ్యక్షులు కోలా జయచంద్ర సారథ్యంలో బీసీ నాయకులు వెళ్లారు.

బాధిత కుటుంబాలకు భానుప్రకాష్ పరామర్శ



నగరి, జనవరి 4: నగరి మండల పరిధిలోని ముడిపల్లి పంచాయతీలోని రామాపురానికి చెందిన టీడీపీ నాయకుడు యరావిళ్ల సుబ్రమణ్యం నాయుడు మృతి చెందడంతో గురువారం ఆయన మృతదేహానికి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ నివాళులర్పించారు. నిండ్ర మండలంలో కావనూరుకు చెందిన టీడీపీ సీనియర్ నేత వెంకటేష్‌రెడ్డి బంధువు వసంతమ్మ మృతి చెందడంతో పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు ఆయన తన సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో దాము నాయుడు, చిత్తూరు బాబు నాయుడు, పరంధామ నాయుడు, దశరథవాసు తదితరులు పాల్గొన్నారు.

గోసంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), జనవరి 4: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలోని గోసంరక్షణ ట్రస్టుకు గుంటూరు జిల్లా తెనాలికి చెందిన నాగరాజకుమారి గురువారం రూ.1,00,116 విరాళంగా అందించారు. విరాళదాతకు ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ స్వామి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు.

పీహెచ్‌సీకి ఫ్రిజ్ వితరణ


డాక్టర్ దుర్గాదేవికి ఫ్రిజ్‌ను అందజేస్తున్న దాత శ్రీధర్‌రెడ్డి

గంగాధరనెల్లూరు, జనవరి 4: చిత్తూరు నగరానికి చెందిన ఎం.వి.కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ ఎం.వి.శ్రీధర్‌రెడ్డి దాతృత్వం పలువురికి ఆదర్శమని డాక్టర్ దుర్గాదేవి అన్నారు. గంగాధరనెల్లూరు పీహెచ్‌సీకి ఫౌండేషన్ తరఫున చైర్మన్ శ్రీధర్‌రెడ్డి రూ.16వేలు విలువచేసే ఫ్రిజ్‌ను డాక్టర్‌కు గురువారం అందజేశారు. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తమతండ్రి పేరుతో ఏర్పాటుచేసిన కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ కార్యదర్శి సహదేవ నాయుడు, మండల రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ పాపిరెడ్డి, డాక్టర్ విజయకుమార్, సీహెచ్‌వో శ్రీనివాసులు, రెడ్‌క్రాస్ ఏవో గోపి, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

సొంతపార్టీ నేతలే విసిగిపోయారు

గంగాధరనెల్లూరు, జనవరి 4: వైసీపీలో సొంతపార్టీ నేతలే సీఎం జగన్ వ్యవహార శైలిపై విసిగిపోయారని జిల్లా టీడీపీ తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయ నాయుడు ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యామన్నారు. చంద్రబాబు, లోకేశ్‌ల నాయకత్వంపై నమ్మకంతోనే అధికారపార్టీ వైసీపీనుంచి టీడీపీలోకి వలసలు పెరుగుతున్నాయని, ఎన్నికలకోడ్ వచ్చేసరికి వైసీపీ ఖాళీ అవుతుందని పేర్కొన్నారు.

వైసీపీ మండల ఉపాధ్యక్షుడిగా నరసింహారెడ్డి

పెనుమూరు, జనవరి 4: పెనుమూరు మండల వైసీపీ ఉపాధ్యక్షుడిగా పెద్దరాజుపల్లి గ్రామానికి చెందిన నరసింహారెడ్డిని నియమిస్తూ పార్టీ ఆదేశాలు జారీ చేసింది. తనపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు పార్టీ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

7న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

చిత్తూరు కల్చరల్, జనవరి 4: కొంగారెడ్డిపల్లె నాయీబ్రాహ్మణకాలనీ సద్గురు త్యాగరాజస్వామి ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 7వతేదీ ఆదివారం నాదబ్రహ్మ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గురువారం ఉత్సవకమిటీ సభ్యులు దేవరాజులు ఒక ప్రకటనలో తెలిపారు.

చేపల చెరువులకు వేలం

నిండ్ర, జనవరి 4: మండలంలోని 18 చెరువుల్లో చేపల పెంపకం కోసం వేలం పాట నిర్వహించినట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రామ్‌కుమార్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 19 చెరువులు ఉండగా, ఒకటి మత్స్యశాఖ సొసైటీకి చెందిందన్నారు. మిగిలిన 18 చెరువులకు ప్రభుత్వం నిర్వహించిన వేలం పాటలో 12 చెరువులకు మాత్రమే వేలం జరిగిందని, మిగిలిన ఆరింటికి ఎవరూ పాల్గొనలేదన్నారు. ఈ 12 చెరువులకు గాను మొత్తం రూ.1,05,300లు వచ్చినట్లు ఆయన తెలిపారు. వేలం పాటలో గ్రామ మత్స్యశాఖ అధికారి షైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవాసాంధ్రుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం: టీడీపీ

వెదురుకుప్పం, జనవరి 4: జీడీనెల్లూరు నియోజకవర్గ ప్రవాసాంధ్రుల ఆత్మీయ సమ్మేళనం, తెలుగుదేశం పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ థామస్ పరిచయ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పార్టీ ప్రభావశీలుల గుర్తింపు కమిటీ రాష్ట్ర సభ్యులు భీమనేని చిట్టిబాబు, ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటరు గురుసాల కిషన్‌చంద్ గురువారం తెలిపారు. ఈనెల 7వ తేదీన బెంగళూరులోని దేవెగౌడ పెట్రోల్ బంకు దగ్గర ఉన్న శ్రీహరి కల్యాణ మండపంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. జీడీనెల్లూరు నియోజకవర్గ ప్రవాసాంధ్రులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

దేశమ్మ ఆలయంలో ఫిబ్రవరి 5 నుంచి కుంభాభిషేకం

నగరి, జనవరి4: నగరి పట్టణ పరిధిలోని టీఆర్ కండ్రిగలో వెలసియున్న దేశమ్మ తల్లి (నేత్రదాత)పునఃనిర్మాణ జీర్ణోద్ధరణ రజిత అష్టబంధన కుంభాభిషేకం ఫిబ్రవరి 5వ తేది నుంచి 11వ తేదీ వరకు జరుగుతుందని ఆలయ చైర్మన్ వేణుబాబు తెలిపారు. గురువారం ఆయన ఆలయంలో మీడియాతో మాట్లాడుతూ శ్రీనారాయణ్ అమ్మన్ వారి దివ్య ఆశీస్సులతో వేదపండితులు శ్రీరామకృష్ణశర్మజ్యోతి సమక్షంలో కుంభాభిషేకం నిర్వహించడం జరుగుతుందన్నారు. చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ, హోమసామగ్రి సరఫరా చేసేందుకు ఆసక్తి గల వారు జనవరి 20వతేదీన 11 గంటలకు నిర్వహించే టెండర్‌లో పాల్గొనాలని ఆయన కోరారు. పాటదారులు రూ.50,000 డిపాజిట్ డీడీ రూపంలో చెల్లించి టెండర్‌లో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు పాల్గొన్నారు.

కోర్టు స్టే ఉంటే కూడా పట్టించుకోరా..?


కాలనీవాసులతో చర్చిస్తున్న ఏఎస్ఐ చలపతి

గుడిపాల, జనవరి 4: మండలంలోని పశుమంద గ్రామంలో ఓ నేలకు సంబంధించి కోర్టులో స్టే ఉన్నా కొంత మంది అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టడానికి వస్తున్నారని గ్రామానికి చెందిన వాణి గురువారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో స్పందించిన ఏఎస్ఐ చలపతి.. గ్రామస్తులు, బాధితురాలితో చర్చించి, తహసీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది.

ప్రతి గ్రామానికి అయోధ్య అక్షతలు

గుడిపాల, జనవరి 4: ప్రతి గ్రామపరిధిలోకి అయోధ్య అక్షతలు చేరుతాయని గుడిపాల ఎంపీటీసీ గోళ్ల హరిప్రసాద్ చౌదరి అన్నారు. మండలంలోని రామభద్రాపురం పంచాయతీలో అక్షతలను ఇంటింటికీ పంపిణీ చేశారు.సేవకులు రమేష్, రవి, దాము, సురేష్, నవీన్, సందీప్, లక్ష్మీపతి, శివ, సుబ్రహ్మణ్యం, త్యాగ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష సిబ్బంది సమ్మెతో
వెలవెలబోతున్న ఎంఈవో కార్యాలయం


ఎంఈవో కార్యాలయంలో సిబ్బంది గదికి తాళాలు, కంప్యూటర్ గదిలో ఖాళీగా ఉన్న కుర్చీలు

గంగాధరనెల్లూరు, జనవరి 4: ఎంఈవో కార్యాలయంలో పనిచేసే సమగ్ర శిక్ష సిబ్బంది గత 15 రోజులుగా సమ్మెలో పాల్గొనడంతో ఆ కార్యాలయం వెలవెలబోతోంది. మండలవిద్యాశాఖలో పనిచేసే ఎంఈవో, రెండవ ఎంఈవో క్షేత్రస్థాయిలో స్కూళ్లను తనిఖీ చేసి, వాటి వివరాలను కార్యాలయంలో పని చేసే కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు చెప్పి ఏరోజుకారోజు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేస్తున్నందున ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి సమస్యలు ఎదురయ్యేవి కావు. తమ డిమాండ్ల సాధనలో భాగంగా ఉద్యోగభద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పుమేరకు సమానపనికి సమానవేతనం ఇవ్వాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంఈవో కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది 2023 డిసెంబరు 20వ తేదీ నుంచి గురువారం 4వ తేదీ వరకు చిత్తూరులో కలెక్టరేట్ వద్ద చేపట్టిన సమ్మెలో పాల్గొంటున్న విషయం తెలిసిందే. ఈసమ్మెలో మండల కోఆర్డినేటర్, కంప్యూటర్ డేటాఎంట్రీ ఆపరేటర్, సీఆర్‌పీలు, మెసెంజర్, హైస్కూల్లో పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, భవిత కేంద్రం టీచర్లు పాల్గొంటున్నారు. దీంతో ఎంఈవోలు స్కూళ్ల తనిఖీలతో పాటు మండలంలోని టీచర్లు అందించే నివేదికల వివరాలను, అదేవిధంగా జిల్లా, రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఆయా మండలాలకు సంబంధించిన స్కూళ్ల వివరాలను కంప్యూటర్‌లో ఆన్‌లైన్‌లో సకాలంలో అప్‌లోడ్ చేసేపరిస్థితి లేక నానావస్థలు పడుతున్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా...?

- తరచూ ప్రమాదాలు


పానాటూరు వద్ద ప్రమాదానికి గురైన ప్రైవేటు బస్సు

గుడిపాల, జనవరి 4: మండలంలోని పలు రోడ్లపైన ఉన్న మలుపులు, గుంతల వద్ద ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వల్ల కొంతమంది ప్రాణాలు పోవడమే కాకుండా మరికొంతమంది గాయాల పాలై ఆస్పత్రుల పాలౌతున్నారు. మండలంలోని దళవాయిపల్లి క్రాస్, పెట్రోల్ బంకు సమీపంలో రోడ్డు గుంతలమయంగా తయారవ్వడంతో చాలామంది పడిలేసి గాయాలపాలైన సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మద్రాస్ క్రాస్ రోడ్డు, పానాటూరు గ్రామ సమీపంలో ఇదేవిధంగా గుంతలమయంగా రోడ్లు ఉండటంతో ప్రతి నిత్యం ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా మెండుగా ఉన్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కాగా పానాటూరు గ్రామ సమీపంలో గురువారం ఒక ప్రైవేటు బస్సును మరో ప్రైవేటు బస్సు వెనుకనుంచి వచ్చి ఢీకొట్టింది. రోడ్డుపైన గుంట ఉండటంతో ముందు వెళ్లే బస్సు డ్రైవర్ సడెన్ బ్రేక్ వేసి నిలిపివేశాడు. ఇదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ఓం శక్తి ఆలయానికి ఎల్లసముద్రం భక్తులు


ఓం శక్తి ఆలయానికి తరలి వెళుతున్న భక్తులు

విజయపురం, జనవరి 4: మండలంలోని ఎల్లసముద్రం నుంచి మేల్‌మురువత్తూరుకు గురువారంఉదయం సుమారు 60 మంది భక్తులు తరలి వెళ్లారు. ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ప్రతి ఏడాది ఓం శక్తి ఆలయానికి ఆనవాయితీగా తరలి వెళుతున్నామని భక్తులు తెలిపారు.

ఓటర్లకు ఈవీఎంపై అవగాహన

బంగారుపాళ్యం, జనవరి 4: మండలంలోని జంబువారిపల్లె, ముంగరమడుగు గ్రామ పంచాయతీల్లో గురువారం ఓటర్లకు ఈవీఎం ద్వారా ఓటువేసే విధానంపై డిప్యూటీ తహసీల్దార్ ఇబ్రహీం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ అనిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెరువు నీటిలో దిగి అంగన్వాడీల నిరసన

కార్వేటినగరం, జనవరి 4: కార్వేటినగరం పద్మ సరస్సు చెరువులో దిగి అంగన్వాడీలు తమ సరికొత్త నిరసనకు శ్రీకారం చుట్టారు. 24 రోజులుగా కొనసాగిస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం అంగన్వాడీలు చెరువులోకి దిగి తమ నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసే బెదిరింపు ప్రకటనలకు భయపడేది లేదన్నారు. తమ న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు. అంగన్వాడీల నిరవధిక సమ్మెకు జిల్లా విద్యా పరిరక్షణ కమిటీ అధ్యక్షులు గోవిందయ్య, జిల్లా ఎపీటీఎఫ్ అధ్యక్షులు కిరణ్‌కుమార్ తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

సీఎం స్పందించే వరకు పోరాటం ఆగదు


నిండ్రలో ఆటపాటలతో అంగన్వాడీల నిరసన

నిండ్ర, జనవరి 4: సీఎం జగన్ తమ సమస్య పరిష్కారం పట్ల స్పందించే వరకు పోరాటం ఆగదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. నిరవధికసమ్మెలో భాగంగా గురువారం మండల కేంద్రమైన నిండ్రలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆటల పాటలతో తమ నిరసన తెలిపారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలోఅంగన్వాడీలు మలర్, షీలా, రేణుక, లీలా, మైథిలీ, రత్నం తదితరులు పాల్గొన్నారు.

జగన్ రెడ్డి ప్రభుత్వంపై తిరగబడుతున్న ప్రజలు: టీడీపీ


కరపత్రాలు ప్రదర్శిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జనవరి 4: జగన్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజలు తిరగబడుతున్నారని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో జగన్ ప్రజావ్యతిరేక విధానాలపై కరపత్రాలను విడుదలచేశారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామాలు చేస్తున్నారని పేర్కొన్నారు. జగన్‌ను నమ్ముకుంటే తమ రాజకీయ భవిష్యత్తు అంధకారమేనని భావించిన చాలా మంది ప్రజాప్రతినిధులు పార్టీలు మారుతున్నారని అన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కు వెళ్లిందని పేర్కొన్నారు.కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు సునీల్ కుమార్, ప్రభు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఎం జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని జిల్లా పార్టీ అధ్యక్షుడు పులివర్తి నాని ఒక ప్రకటనలో తెలిపారు. అందుకే తమ ఎమ్మెల్యేలను, ఎంపీలను ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి మార్చుతున్నారని విమర్శించారు. రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని, చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని ఆప్రకటనలో ఆయన తెలిపారు.

సప్త కన్నికలమ్మను దర్శించుకున్న మంత్రి

చిత్తూరు కల్చరల్, జనవరి 4: నగరంలోని దొడ్డిపల్లె సప్తకన్నికలమ్మ అమ్మవారిని గురువారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి దర్శించుకున్నారు. చిత్తూరులో వైఎస్ఆర్ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన వారికి ఆలయ నిర్వాహకులు దళవాయి శివకుమార్, సునీత, కుమారవేలు, మాధవన్‌లు ఘనంగా స్వాగతం పలికి, పూజలకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, పలువురు కార్పొరేటర్లు, వైకాపా కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి: బీజేపీ


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి

బంగారుపాళ్యం, జనవరి 4: గ్రామీణ ప్రజలు కేంద్రప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్‌పీ వెంకటేశ్వరచౌదరి అన్నారు. గురువారం మండలంలోని ముంగరమడుగు, గుంతూరు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఉజ్వల యోజన గ్యాస్ కిట్లు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు అందజేశారు. వ్యవసాయశాఖ వారు డ్రోన్ల గురించి, నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించారు. పూతలపట్టు బీజేపీ ఇన్‌చార్జి భానుప్రకాష్, అభిలాష్, అధికారులు పాల్గొన్నారు.


కరపత్రాలను చూపుతున్న అధికారులు, బీజేపీ నేతలు

శ్రీరంగరాజపురం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కృష్ణయ్య తెలిపారు. గురువారం ఆయన మండలంలోనే గ్రామాల్లో పిళ్లారికుప్పం సచివాలయం పరిధిలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించి, కరపత్రాలను ఆవిష్కరించారు. నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రాజేంద్రన్, జ్యోతిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె విరమించేదిలేదు

నగరి, జనవరి 4: సమస్యలను పరిష్కరించేవరకు సమ్మె విరమించేది లేదని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. నగరి మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట రెండవ రోజు గురువారం మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపారు. ఏఐటీయూసీ నేత కోదండయ్య, మురళి, రాజేంద్ర, వెంకటేశ్, శేఖర్, రాము, సతీష్, మురగమ్మ, కాంచన, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

గుడిపాల, జనవరి 4: మండలంలోని అన్న క్యాంటీన్‌లో గురువారం 170వ రోజు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన చంద్ర నాయుడు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం నాయుడు, చిట్టి యాదవ్, కిట్టు, గోవింద గౌడ్, ఐజాక్, రాజా, జయచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మేల్‌మరువత్తూర్‌కు ఉచిత బస్సులు


చీరలు పంపిణీ చేస్తున్న చెన్నకేశవులు నాయుడు

చిత్తూరు సిటీ, జనవరి 4: జీజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేల్‌మరువత్తూర్‌కు ఉచిత బస్సులు ఏర్పాటు చేశారు. గురువారం నగరంలోని తిమ్మసానిపల్లి, గుడిపాల మండలంలోని పేయనపల్లి, వసంతాపురం, పెద్దదళవాయిపల్లె గ్రామాల్లోని ఓంశక్తి భక్తులు ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాల్లో జీజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓంశక్తి భక్తులకు ఉచితంగా చీరలు పంపిణీచేశారు. అనంతరం మేల్‌మరువత్తూరుకు వెళ్లే నాలుగు ఉచిత బస్సులను చెన్నకేశవులు నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ గురజాల జగన్‌మోహన్‌కు ఓంశక్తి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ఓంశక్తి భక్తులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండరు ఆవిష్కరణ



వెదురుకుప్పం, జనవరి 4: వెదురుకుప్పం ఎమ్మార్సీ వద్ద యూటీఎఫ్ క్యాలెండరును గురువారం ఎంఈవో-1 మహేశ్వరరావు, ఎంఈవో-2 దామోదరం ఆవిష్కరించారు. యూటీఎఫ్ నాయకులు లోకనాథం, దేశయ్య, పీతాంబరరెడ్డి, పురుషోత్తం, గురునాథం పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలోనే సంక్షేమం

వెదురుకుప్పం, జనవరి 4: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక చంద్రబాబు పాలనలోనే పేదలందరికీ సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఎస్సీ సెల్ జీడీనెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షులు బీఎం రవి తెలిపారు. గురువారం వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ కొండకిందపల్లె గ్రామంలో పార్టీ వెదురుకుప్పం మండలాధ్యక్షులు కామసాని లోకనాథరెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి చెంగల్రాయరెడ్డి, బూత్ కమిటీ కన్వీనర్ శంకర్, డేటా ఆపరేటరు మోహన్‌మురళి పాల్గొన్నారు.

థామస్‌ను ఎదుర్కొనే దమ్ము ఉందా స్వామీ: టీడీపీ

వెదురుకుప్పం, జనవరి 4: టీడీపీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ థామస్‌కు నియోజకవర్గంలో వస్తున్న ప్రజాదరణను చూసి డిప్యూటీ సీఎం నారాయణస్వామికి ఓటమి భయంతో వెన్నులో వణుకు పుట్టిందని, థామస్‌ను ఎదుర్కొనే దమ్ము ఉందా స్వామీ అంటూ తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేసనూరు మునిచంద్రారెడ్డి గురువారం తెలిపారు. థామస్‌పై ఆరోపణలు చేయడం సముచితం కాదన్నారు. రాబోయే ఎన్నికల్లో జీడీనెల్లూరు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి థామస్ అత్యధిక మెజారిటీతో గెలుపు తథ్యమని జోస్యం పలికారు.

జిమ్ భవన నిర్మాణానికి భూమి పూజ

విజయపురం, జనవరి 4: మండలంలోని పన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జిమ్ భవన నిర్మాణానికి మంత్రి ఆర్కే రోజా గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించడానికి రూ.56 లక్షల నిధులతో భవన నిర్మాణం చేస్తున్నామన్నారు. అనంతరం పన్నూరు, విజయపురం ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.3 వేలుకు పెంచిన పింఛను పంపిణీ చేశారు. ఎంపీడీవో చంద్రమౌళి, శాప్ డీఈ కలీల్, ఏఈ ప్రసాద్, సర్పంచ్‌లు సునందనా మనోహర్‌రెడ్డి, కుమార్, సుబ్రహ్మణ్యం, బాస్కర్‌రెడ్డి, శ్రీరాములురెడ్డి, ఎంపీటీసీలు గోవిందమ్మ, రాజగోపాల్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీస్తేనే సార్థకత

గంగాధరనెల్లూరు, జనవరి 4: విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాన్ని, ఆలోచన సరళిని వెలికితీస్తేనే సార్థకత లభిస్తుందని ఎంఈవో ఆంజనేయులుశెట్టి పేర్కొన్నారు. ఆడపిల్లల భద్రతపై మండలంలోని వివిధ స్కూళ్లల్లో 6 నుంచి 10వతరగతి విద్యార్థులు 15 మందికి గంగాధరనెల్లూరు హైస్కూల్లో గురువారం వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఇక్కడ గెలుపొందిన విద్యార్థులు చిత్తూరు పీసీఆర్ కాలేజీలో జిల్లాస్థాయిలో నిర్వహించే పోటీలకు హాజరవుతారని ఎంఈవో చెప్పారు. హెచ్‌ఎం హేమలత, టీచర్ మురళి పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

బంగారుపాళ్యం, జనవరి 4: మండల కేంద్రంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో గురువారం మొగిలికి చెందిన మండలపార్టీ టీడీపీ అధికార ప్రతినిధి మంజునాథ్ కుమారుడు బియాన్ చౌదరి జన్మదినం సందర్భంగా భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు ధరణీ నాయుడు, కమల్‌నాథ రెడ్డి, కుప్పాల మురళి, జనార్దన్ గౌడ్, హేమచంద్ర నాయుడు, గురుస్వామి, ఎన్‌పీఎస్ శివ తదితరులు పాల్గొన్నారు.

పలువురు వైసీపీలో చేరిక


విజయానందరెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి జేఏసీ నాయకులు

చిత్తూరు, జనవరి 4: చిత్తూరు నగరం, రూరల్, గుడిపాల మండలాల నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు గురువారం వైసీపీలో చేరారు. చిత్తూరులో పాత బస్టాండులో పండ్ల వ్యాపారస్తులు, 36వడివిజన్‌లోని గూలింగ్స్‌పేటలో ముస్లిం మైనార్టీలకు ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి వైసీపీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రెడ్డి జేఏసీ నాయకులు, యాదవ సంఘ నేతలు వేర్వేరుగా సన్మానించారు.